# ఓటరు స్లిప్‌లు పంపిణీ చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి

- పోలింగ్ కేంద్రాల్లో కనీస సౌకర్యాలుండాలి
- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి

కలెక్టరేట్, నవంబర్ 16: నిర్దేశిత గడువులోగా ఓటరు సమాచార స్లిప్పులను పంపిణీ పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో ఎన్నికల ఏర్పాట్లపై అదనపు కలెక్టర్ ఎన్ ఖీమ్యానాయక్. రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇప్పటికే ఓటరు సమాచార స్లిప్పులను బూత్ లెవల్ అధికారుల ద్వారా పంపిణీ ప్రారంభమైందని తెలిపారు. ఓటరు సమాచార స్లిప్పులను కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు పంపిణీ చేయాలన్నారు. సిరిసిల్ల, వేములవాడ నియోజకవర్గాల పరిధిలోని 547 పోలింగ్ కేంద్రాల్లో కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన మేరకు కనీస మౌలిక సదుపాయాలు ఉండేలా చూసుకోవాలన్నారు. హోమ్ ఓటింగ్‌ను ఆరోపణలు లేకుండా, షెడ్యూల్ ప్రకారం పారదర్శకంగా చేపట్టాలన్నారు. సెక్టార్ అధికారులు హోమ్ ఓటింగ్‌ను కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు జరిగేలా మానిటరింగ్ చేయాలన్నారు. ఎన్నికల విధుల్లో ఉన్న పోలింగ్ సిబ్బందికి శిక్షణ నిర్వహించే వేదికల వద్ద ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, వారు ఓటుహక్కు వినియోగించుకునేలా చూడాలన్నారు. అత్యవసర సేవలో ఉన్న ఉద్యోగులకు రిటర్నింగ్ కార్యాలయాల వద్ద ఫెసిలిటేషన్ కేంద్రాన్ని ఏర్పాటు చేసి, ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఏర్పాట్లు చేయాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు రాండమైజేషన్, ఈవీఎంల కమిషనింగ్ కార్యక్రమాలను చేపట్టాలని సూచించారు. సమన్వయంతో వ్యవహరిస్తూ ఎన్నికలు నిస్పక్షపాతంగా, స్వేచ్ఛాయుత వాతావరణంలో పారదర్శకంగా జరిగేలా కృషి చేయాలన్నారు. ఇక్కడ రిటర్నింగ్ అధికారులు ఆనంద్‌కుమార్, మధుసూదన్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ గంగయ్య ఉన్నారు.

**సీ-విజిల్‌తో అక్రమాలకు అడ్డుకట్ట**

ఎన్నికల కమిషన్ రూపొందించిన సీ-విజిల్ యాప్‌ను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ అనురాగ్ జయంతి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయా పార్టీల ఏజెంట్లు, ప్రతినిధులు, ప్రజలు స్మార్ట్ మొబైల్‌లో సీ-విజిల్‌ను డౌన్‌లోడ్ చేసుకోవడంతోపాటు ప్రజలను చైతన్యం చేయాలన్నారు. ఎవరైనా ప్రలోభాలకు గురిచేసినా, క్షేత్ర స్థాయిలో అక్రమాలు జరుగుతున్నట్లు గుర్తించినా వెంటనే సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయాలన్నారు. ఇందుకోసం ప్రజలు సహకారం అందించాలని కోరారు.

## పుట్‌బాల్‌లో రాష్ట్రస్థాయికి ఎంపిక

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 16: వెంకటాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ఎం నిషాంత్, మనితేజ్, సౌమ్య పుట్‌బాల్ అండర్-14 విభాగంలో జిల్లా స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులను డీఈవో రమేశ్‌కుమార్, ప్రధానోపాధ్యాయులు మాణిక్యం, పీడీ రవికుమార్ అభినందించారు.

## నేడే నాగుల చవితి

వేములవాడ టౌన్, నవంబర్ 16: నాగుల పంచమి, నాగుల చవితి విశిష్టదినాల్లో నాగదేవతను పూజించడం వేదకాలంనుంచి ఉంది. మన పురాణాల్లో ఎన్నో విషయాల్లో నాగుల చవితి గురించిన ప్రస్తావన ఉంది. వీటికి మానవులతో ఉన్న సంబంధ బాంధవ్యాల గురించి అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి. పంచమి, చతుర్థి రోజు ఉపవాసం ఉండి పాములను పూజిస్తే పుణ్యప్రదమని పురాణాలు చెపుతున్నాయి. పాము కరచిన వ్యక్తి మరణిస్తే పాతాళానికి పోయి, విషంలేని పాముగా పుడతాడని, అతడికి మోక్షం లభించాలంటే అతడి సోదరులు, కుమారులు, కుమార్తె, భార్య నాగుల పంచమి, నాగులచవితి రోజున ఉపవాసం ఉండి నాగులను పూజించాలని పురాణకథ ప్రచారంలో ఉంది. ఈ క్రమంలో శుక్రవారం నాగులచవితి సందర్భంగా మహిళలు పుట్ట వద్దకు వెళ్లి వత్తిని దారంగా తీసి, పుట్ట చుట్టూరా కట్టి పసుపు కుంకుమలతో అలంకరించి, చుట్టూ నీళ్లు చల్లి బియ్యపు పిండితో ముగ్గులు వేయనున్నారు. తర్వాత పూజలు చేయనున్నారు. నాగులను పూజిస్తే శివకేశవులను పూజించిన ఫలితం దక్కుతుందని పురాణాల్లో చెప్పారు.



శ్రీనివాస్‌రెడ్డికి కండువా కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న వినోద్‌కుమార్

## బీఆర్‌ఎస్‌లోకి బీజేపీ నేతలు

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 16: మండల కేంద్రానికి చెందిన బీజేపీ నాయకుడు నేవూరి శ్రీనివాస్‌రెడ్డి, గొల్లపల్లికి చెందిన కొండ దాసుగౌడ్ గురువారం తెలంగాణభవన్‌లో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఇద్దరికి రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు వినోద్‌కుమార్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. నియోజకవర్గంలో మంత్రి కేటీఆర్ చేసిన అభివృద్ధికి తాము ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు వారు చెప్పారు.



బీజేపీ నేత కొండ దాసుగౌడ్‌కు గులాబీ కండువా కప్పి బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్నన నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు, నాయకులు

## ఘనంగా ధ్వజారోహణం

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 16: అల్మాస్‌పూర్‌లోని అయ్యప్ప దేవాలయంలో గురువారం ధ్వజారోహణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సుప్రభాత, గణపతిహోమం, నవగ్రహ పూజ చేశారు. మహిళలు మంగళహారతులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.



స్వయంపాలన దినోత్సవంలో పాల్గొన్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

## కష్టపడితేనే మంచి ఫలితాలు

ముస్తాబాద్, నవంబర్ 14: విద్యార్థులు చిన్ననాటి నుండే కష్టపడి చదివితేనే మంచి ఫలితాలు వస్తాయని ప్రధానోపాధ్యాయులు రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని కొండాపూర్ ఉన్నత పాఠశాలలో బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని పాఠశాలలో గురువారం స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా పాఠాలు భోధిన తీరును ఉపాధ్యాయులు పరిశీలించారు. అనంతరం హెచ్‌ఎం మాట్లాడుతూ ప్రతి విద్యార్థి లక్ష్యం కోసం కష్టపడి చదివి, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని కోరారు. పదో తరగతి విద్యార్థులు వార్షిక పరీక్షల్లో భయం లేకుండా రాయాలని, శ్రద్ధగా చదివి ఉన్నత స్థానాలకు ఎదగాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో విద్యార్థులు టీచర్‌గా వ్యవహరించడం చక్కని ప్రదర్శన ఇచ్చారు. కార్యక్రమంలో తాత్కాలిక డీఇవోగా క్యారం ప్రణయ్, తాత్కాలిక హెచ్‌ఎంగా పెండ్యాల వైష్ణవి వ్యవహరించారు. వీరిని ఉపాధ్యాయబృందం అభినందించారు.

## అప్రమత్తంగా ఉండాలి

ఎల్లారెడ్డిపేట, నవంబర్ 16: ఎన్నికల నేపథ్యంలో మద్యం విక్రయాలకు ఆస్కారం ఉన్నందును అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ ఏ విజయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని ఓ వైన్‌షాపులో సూపరింటెండెంట్ పంచాక్షరితో కలిసి తనిఖీలు నిర్వహించారు. గుడుంబా విక్రయాలు, తయారీ, రవాణాపై నిఘా పెంచాలని, గంజాయి రవాణాకు ఆస్కారం ఉన్న దృష్ట్యా వాహనాల తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. ఇక్కడ ఎక్సైజ్ సీఐ చంద్రశేఖర్ ఉన్నారు.



ఎల్లారెడ్డిపేటలోని వైన్‌షాపులో తనిఖీ చేస్తున్న విజయ్‌భాస్కర్‌రెడ్డి

## సమస్యాత్మక కేంద్రాలపై దృష్టిసారించాలి

- ఎస్పీ అఖిల్ మహాజన్
- బావుసాయిపేటలో పోలింగ్ కేంద్రం తనిఖీ



బావుసాయిపేటలోని పోలింగ్ కేంద్రం వద్ద సిబ్బందికి సూచనలిస్తున్న ఎస్పీ అఖిల్ మహాజన్

కోనరావుపేట, నవంబర్ 16: ఎన్నికల నేపథ్యంలో సమస్యత్మకమైన పోలింగ్ కేంద్రాలపై పోలీసులు దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ సూచించారు. కోనరావుపేట మండలంలోని బావుసాయిపేట, సుద్దాల, కోనరావుపేట, మల్కపేట, నిజామాబాద్, నిమ్మపల్లి గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈసందర్భంగా భద్రత చర్యల దృష్ట్యా ఆయా గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలలో సీసీ కెమెరాలు, మౌలిక సదుపాయాలను కల్పించేందుకు ముందస్తుగా ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఆయా గ్రామాలలో కేంద్ర పోలీసు బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించడంతో పాటు ఓటింగ్ పట్ల ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రధానంగా ఎన్నికల సమయం సమీపిస్తున్న వేళ పోలీసు సిబ్బంది రెట్టింపు ఉత్సహంతో పనిచేసి పోలింగ్ విజయవంతంగా కొనసాగేలా చూడాలన్నారు. అనంతరం మండల కేంద్రంలో కేంద్ర పోలీసు బలగాలతో నిర్వహించిన ఫ్లాగ్ మార్చ్‌లో పాల్గొన్నారు. ఇక్కడ వేములవాడ డీఎస్పీ నాగేంద్రచారి, చందుర్తి సీఐ కిరణ్‌కుమార్, ఎస్ఐ అంజనేయులు, ఎఎస్ఐ శ్రీనివాస్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

## ఒకరి బలవన్మరణం

తెలంగాణ చౌక్, నవంబర్ 16: ఆర్థిక ఇబ్బందులతో శుక్రవారం ఒకరు ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. వివరాల్లోకి వెళ్తే .. సిరిసిల్ల పట్ట ణం పద్మనగర్‌కు చెందిన మంగళపల్లి సాయిచంద్(32)గత బుధవారం రాత్రి భోజనం చేసి ఇంట్లోంచి వెళ్లాడు. తిరిగిరాకపోవడంతో అతడి కోసం వెతకగా గురువారం మానేరువాగు కరకట్ట వద్ద బైక్, ఫోన్‌ను గుర్తించిన స్థానికులు పోలీసులకు సమచారం అందించారు. ఆర్థిక ఇబ్బం దులతోనే సాయిచంద్ ఆత్మహత్య చేసుకున్నాడ ని అతడి భార్య ఉష ఫిర్యాదు చేయగా, కేసు ద ర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ ఉపేందర్ చెప్పారు.

**చికిత్స పొందుతూ ..**

చందుర్తి, నవంబర్ 16: మల్యాల గ్రామానికి చెందిన పిట్ల రాజయ్య (55) కొంతకాలంగా ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 11న పురుగుల మందు తాగగా, కుటుంబ సభ్యులు సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించగా, గురువారం చికిత్సపొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్ తెలిపారు.

## వైభవంగా సహస్ర దీపోత్సవం



అభిషేకపూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వేములవాడ టౌన్, నవంబర్ 16: వేములవాడ పట్టణంలో శ్రీరాజరాజేశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సహస్రదీపోత్సవ కార్యక్రమం గురువారం వేదఘోషతో మార్మోగింది. కార్తీకమాసాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణంలోని శ్రీరాజరాజేశ్వర ట్రస్ట్ ఆధ్వర్యంలో సహస్రదీపోత్సవ కార్యక్రమం నాలుగేండ్లుగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు రాగంపేట హరిబాబు తెలిపారు. ఇక్కడ మామిడిపెల్లి వెంకటేశం, భాస్వంత్, చౌటి లక్ష్మణ్, చొప్పకట్ల భాను, తిగుళ్ల శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ఉత్తమ పౌరులుగా రాణించాలి

వేములవాడ రూరల్, నవంబర్ 16: విద్యార్థులు చదువుతోపాటు అన్ని రంగాలపై అవగాహన కలిగిఉండి ఉత్తమ పౌరులుగా రాణించాలని అగ్రహారం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం వేములవాడ మండలం అగ్రహారం డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం యూనిట్స్ ఆధ్వర్యంలో పిల్లల కోసం తొలిమెట్టు కార్యక్రమం పై కళాశాల విద్యార్థులకు శిక్షణ తరగతులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం, కళాశాల విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా పిల్లల కోసం తొలిమెట్టు కార్యక్రమాన్ని రూపొందించిందన్నారు. ఈ శిక్షణ పూర్తి చేసుకున్న ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ఈ నెల 18నుంచి వారికి కేటాయించిన ఆయా పాఠశాలలో తమ సేవా కార్యక్రమాలను నిర్వహిస్తారన్నారు. ఇక్కడ ఎన్ఎస్ఎస్ ప్రోగాం అధికారి తిరుకోవెల శ్రీనివాస్, రమాదేవి, వెంకటేశ్వర్లు, మధురాజేశ్, అఫ్సరీఉస్మాని, మల్లారెడ్డి, రాజేశ్, ప్రభాకర్, శ్రీనివాసులు, కరుణ, నారాయణ, నర్సయ్య, మధుబాబు ఉన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ వడ్లూరి శ్రీనివాస్